


జొన్న రైతుకు బాసట

రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఏటా నష్టాలపాలవుతున్నారు. ధరలు పతనమైనప్పుడు ప్రభుత్వం మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయిస్ తదితర సంస్థల ద్వారా తక్షణం రంగంలోకి దిగితే వ్యాపారులు దారిలోకి వస్తారు. ప్రభుత్వం పంటల దిగుబడులు, రైతుల లాభనష్టాలను బేరీజు వేసుకుని తద్వారా వెంటనే ఆయా సంస్థల ద్వారా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తూ రైతులకు అండగా ఉంటోంది. గత ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నలను కొనుగోలు చేసి తిరిగి లాభాలకు విక్రయించిందనే విమర్శలున్నాయి.. ఇలాంటి విమర్శలు రాకుండా ఈ ఏడాది రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ అధికారులు అత్యంత నాణ్యమైన సీ 43 హైబ్రీడ్ జొన్నలను కొనుగోలు చేసి తిరిగి రేషన్ దుకాణాల ద్వారా ఆ నాణ్యమైన జొన్నలను ప్రజలకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం నియోజకవర్గాల్లో అత్యధికంగా రైతులు మహీంద్రా సీ43 జొన్నను పండిస్తున్నారు.

-నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి)

- కొనుగోలుకు 3,00,000 క్వింటాళ్లు సిద్ధం
- పౌరసరఫరాల సంస్థ ద్వారా నేటి నుంచి కొనుగోలు
- వారం రోజుల్లోనే రైతు ఖాతాలో డబ్బు జమ
- ప్రభుత్వ మద్దతు ధర రూ.3.371

సీ43 హైబ్రీడ్ జొన్న కొనుగోలుకు ఆదేశాలు

జిల్లాలో హైబ్రిడ్ రకం జొన్నకు మార్కెట్ ధర కంటే తక్కువగా ఉండడంతో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. బయట మార్కెట్‌లో క్వింటం జొన్నలు రూ.2,200 నుంచి రూ.2,500 వరకు ఉండడంతో రైతులు అయోమయంలో పడ్డారు. డిసెంబర్, జనవరిలోనే పంట కోతకు రావడంతో అనేక మంది రైతులు రూ.2,200కే అమ్ముకున్నారు. మరికొందరు రైతులు ప్రభుత్వ మద్దతు ధర కోసం ఎదురు చూస్తూ గోదాముల్లో దాచుకున్నారు. జిల్లాలో అత్యధికంగా పండించే హైబ్రిడ్ జొన్నకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఈ విషయాన్ని ఇటీవలే జిల్లా మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు వ్యవసాయాధికారుల నుంచి పంట నివేదికలు తెప్పించుకొని పౌరసరఫరాల సంస్థ ద్వారా రూ.3,371 ప్రభుత్వ మద్ధతు ధరను నిర్ణయించి కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు. పంట కొనుగోలు చేసిన వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసేలా చర్యలు తీసుకున్నారు



సీ43 రకం జొన్నలు

నియోజకవర్గాల వారీగా జొన్న పంట వివరాలివి..(వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం)

నియోజకవర్గం	ఎకరాలు	దిగుబడి (క్వింటాలు)	ఇప్పటికే రైతు విక్రయించిన పంట	నిల్వవున్న పంట(క్వి)
నంద్యాల	11,115	1,89,290	79,822 (క్వి)	1,09,468
ఆళ్లగడ్డ	16,842	2,11,758	1,15,732	96,026
బనగానపల్లె	14,323	1,91,702	1,17,261	74,441
డోన్	997	10,026	9,254	772
నందికొట్కూరు	3606	46,023	16,144	29,879
శ్రీశైలం	4816	1,07,784	9,367	98,417
పాణ్యం	11,077	2,18,804	1,07,425	1,11,379
మొత్తం	62,239	9,75,388	4,55,055	5,20,388

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నేను 15 ఎకరాల్లో జొన్న పంట వేశా. దిగుబడి బాగానే వచ్చినా మార్కెట్లో ధర లేదు. రూ.2200 నుంచి రూ.2500 వరకు అడుగుతున్నారు. చాలా మంది రైతులు గోదాముల్లో నిల్వపెట్టలేక అమ్ముకున్నారు. దళారుల చేతుల్లో అనేక మంది నష్టపోయారు. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని నేను గోదాముల్లో నిల్వ చేసి మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్నా. మద్దతు ధరకు జొన్నల కొనుగోలుకు ముందుకు వచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- వెంకటసుబ్బయ్య, రైతు, గ్రంధివేముల, గడివేముల మండలం

116 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు



సీ43 రకం జొన్నలను జిల్లాలోని అత్యధికంగా పండించే మండలాల్లో 116 రైతు సేవాకేంద్రాల ద్వారా బుధవారం నుంచి కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే క్వాలిటీని పరీక్షించి కొనుగోలు చేసేందుకు డీసీఎంఎస్ ఏజన్సీ ద్వారా సిబ్బందిని కూడా నియమించాం. జిల్లాలో 30వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. రైతుల డిమాండ్ బట్టి మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. కొనుగోలు చేసిన వారంలోపే రైతుల ఖాతాలో జమచేస్తాం.

- రాజునాయక్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, నంద్యాల.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సప్లయ్ లేకపోయినా కర్నూలు మార్కెట్‌యార్డులో ఉల్లి ధర తగ్గుతోంది. మంగళవారం కర్నూలు మార్కెట్‌యార్డుకు కేవలం 914క్వింటాళ్ల ఉల్లి మాత్రమే అమ్మకానికి వచ్చింది. అయితే.. వ్యాపారులు మాత్రం క్వింటం ఉల్లికి గరిష్ఠంగా కేవలం రూ.1,109లు, మధ్యస్థ ధర రూ.860 కనిష్ఠ ధర రూ.505 మాత్రమే రైతుల చేతుల్లో పెట్టారు. వేరుశనగ కాయలకు ప్రభుత్వం రూ.6,550లు మద్దతు ధర ప్రకటిస్తే కర్నూలు యార్డులో గరిష్ఠంగా రూ.6,491లు, మధ్యస్థ ధర రూ.5,669లు, కని ష్ఠ ధర రూ.3,070లు మాత్రమే దక్కింది. వాముకు గరిష్ఠ ధర క్వింటానికి రూ.24,440లు, మధ్యస్థ ధర రూ.11,099లు దక్కింది. మొక్కజొన్నలకు ప్రభుత్వం ప్రకటిం చిన మద్దతు ధర రూ.2,250 కాగా, కర్నూలు మార్కెట్‌యార్డులో గరిష్ఠంగా కేవలం రూ.2,183, మధ్యస్థ ధర రూ.2,154లు, కనిష్ఠ ధర రూ.2,050లు మాత్రమే దక్కింది. కందులకు కూడా ధర పూర్తిగా తగ్గిపోయింది. గత సంవత్సరం ఇదే సమయానికి క్వింటం కందుల ధర రూ.9వేల నుంచి రూ.10వేలు ఉండగా.. ప్రస్తుతం క్వింటానికి గరిష్ఠంగా రూ.7,269లు మాత్రమే దక్కు తుంది. మధ్యస్థ ధర రూ.6,929లు, కనిష్ఠ ధర రూ.2,729లు దక్కింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,749లు, మధ్యస్థ ధర రూ.5,619లు, కనిష్ఠ ధర రూ.4,899లు దక్కింది. మిర్చి వివిధ రకాలకు క్విం టానికి గరిష్ఠంగా రూ.11,439 నుంచి రూ.5,490లు మాత్రమే దక్కింది. కొర్రలకు క్వింటానికి గరిష్ఠంగా రూ.2,029లు, మధ్యస్థంగా రూ.2,019లు, కనిష్ఠ ధర రూ.1,709లు దక్కింది. మినుములకు గరిష్ఠ ధర రూ.7,279లు, మధ్యస్థ ధర రూ.6,911లు, కనిష్ఠ ధర రూ.5,111 పలికింది.

మౌలిక సదుపాయాలు కల్పించండి: కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్మన్ కింద గుర్తించిన గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల సదుపాయాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రధాన మంత్రి జన్మన్, డా జుగ పథకాల్లో భాగంగా గుర్తించిన 11అంశాల్లో పురోగతిపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 14మండలాల్లో 48గిరిజన నివాసిత ప్రాంతాల్లో పీఎం జన్మన్ కింద గుర్తించిన 11అంశాల్లో చేపట్టిన పనులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని పూర్తిచేయాలని ఆదేశించారు. గూడెంలో గృహనిర్మాణాలకు సంబంధించి 527ఇళ్లు మంజూరుకాగా వాటిలో కేవలం 92మాత్రమే పూర్తయ్యాయని, మిగతావాటిని కూడా పూర్తిచేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. కపిలేశ్వరం నుంచి జానాల గూడెం వరకు వేస్తున్న 7.11కి.మీ. బీటీరోడ్డును పూర్తిచేయాలని, రోడ్లులేని గ్రామాల్లో ఏపీ ఉండకుండా ఉపాధిహామీ ద్వారా అనుమతులు తీసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించారు. గిరిజనులకు వైద్య సదుపాయాలు అందజేసేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎంజేఏవై కార్డులద్వారా 5లక్షలవరకు దేశంలో ఎక్కడైనా వైద్యసదుపాయం పొందే అవకాశం ఉందని అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రూ.25లక్షల వరకు ఉచిత వైద్యచికిత్సలు పొందే అవకాశం ఉన్నందున చెంచుగూడేల్లోని ప్రజలకు సదరు కార్డులు అందజేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీఓ వెంకటశివప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

వైభవంగా భ్రామరి కుంభోత్సవం

- హారతి ఇచ్చిన స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు
- నిజరూపాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



అమ్మవారికి హారతి ఇస్తున్న స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు

శ్రీశైలం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబికాదేవి కుంభోత్సవాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏటా చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత అమ్మవారికి కుంభోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తోంది. ఇందులో భాగంగానే భ్రమరాంబికాదేవి ఆలయాన్ని గుమ్మడికాయలు, నిమ్మకాయలు, పుష్పాలతో సుందరీకరించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. అనంతరం నవావరణ పూజ, ఖడ్గమాల, త్రిశతి, అష్టోత్తర కుంకుమ పూజలు, పారాయణాలు నిర్వహించారు. అలాగే రజకుని చేత అమ్మవారి ఆలయంలోని శ్రీచక్రం వద్ద ఆనవాయితీ ప్రకారం ముగ్గువేయించి కుంభోత్సవానికి నాందిపలికారు. అలాగే హరిహరరాయ గోపురం వద్ద గల మహిషాసురమర్దిని అమ్మవారికి పూజాదికాలు జరిపి ఆ తర్వాత గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో పాటు నిమ్మకాయలతో స్వాత్వికబలిని సమర్పించారు. పసుపు, కుంకుమను సమర్పించి అమ్మవారికి శాంతి ప్రక్రియ క్రతువును సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజల అనంతరం మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం చేసి ఆలయాన్ని మూసివేశారు. అదేవిధంగా అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న సింహ మంటపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా పోశారు. ఆ తర్వాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించారు. ఆ తర్వాత రెండో విడతగా అమ్మవారికి గుమ్మడికాయలు, కొబ్బరి కాయలతో సాత్వికబలిని ఇచ్చారు. చివరగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి పిండివంటలతో మహానివేదన ఇచ్చారు. ఈ ఉత్సవంలో భాగంగానే గ్రామదేవత అంకాలమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి, ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



రాశిగా పోసిన కొబ్బరికాయలు



పల్లకోత్సవంలో పాల్గొన్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

నిజరూపాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీశైలంలో జరిగే కుంభోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం భ్రమరాంబికాదేవి అమ్మవారు నిజరూప అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఏడాది కుంభోత్సవం జరిగే రోజున మాత్రమే అమ్మవారు నిజరూప అలంకరణతో దర్శనమివ్వడం ఇక్కడ సంప్రదాయబద్ధంగా వస్తోంది. మిగతా రోజు అమ్మవారు విశేషమైన అలంకరణతో శాంతిస్వరూపిణిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించేవారు. అయితే కుంభోత్సవం సందర్భంగా భ్రామరి అమ్మవారి నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. అమ్మవారి నిజరూప దర్శన సమయంలో మల్లికార్జునస్వామి దర్శనాన్ని నిలిపివేశారు.

పల్లకీ ఉత్సవం

స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.



గుమ్మడికాయలు సమర్పిస్తున్న సిబ్బంది, భక్తులు



రాశిగా పోసిన అన్నం

గుండ్రేవులకు కదలిక

- కర్ణాటక, తెలంగాణ, కృష్ణా బోర్డుకు డీపీఆర్ పంపిన ప్రభుత్వం
- వైసీపీ హయాంలో అటకెక్కిన వైనం
- కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కదలిక
- ఉమ్మడి ప్రాజెక్టుకుగా 35 టీఎంసీలకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- రెండు రాష్ట్రాలు చర్చలు జరిపితే కొలిక్కివచ్చే అవకాశం
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి

కర్నూలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతుల ప్రాణనాడి 'గుండ్రేవుల జలాశయం' నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వైసీపీ హయాంలో అంతర్రాష్ట్ర సమస్య అంటూ ఐదేళ్లు పూర్తిగా అటకెక్కించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి సభల్లో చర్చించారు. ఆ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, మూడేళ్లలో చేపడుతామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జవాబు ఇచ్చారు. కర్ణాటక, తెలంగాణ, కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అభిప్రాయాలు తెలుసుకోడానికి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) పంపించారు. నివేదిక పరిశీలించిన తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టుకు చేపట్టడడంతో పాటు 35 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన చేసినట్లు సమాచారం. రెండు రాష్ట్రాలు చర్చలు జరిపితే ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కర్నూలు-కడప (కేసీ) కాలువ పరిధిలో 2.65,628 ఎకరాల ఆయకట్టు ఉంది. తుంగభద్ర నది నుంచి 39.90 టీఎంసీలు నికర జలాలు కేడబ్ల్యూడీటీ-1 అవార్డు కేటాయింపులు చేశారు. అందులో 8 టీఎంసీలు ఎస్ఆర్‌బీసీ కాలువకు కేటాయించారు. మిగిలిన 31.90 టీఎంసీలు వాటాలో 10 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి, 21.90 టీఎంసీలు నది ప్రవాహం నీటిని సుంకేసుల బ్యారేజీ నుంచి మళ్లించాలి. కోట్ల విజయభాస్కరరెడ్డి సుంకేసులు బ్యారేజీ సామర్థ్యం కేవలం 1.20 టీఎంసీలు మాత్రమే ఉంది. తుంగభద్రకు వరద రోజులు తగ్గిపోవడం, తుంగభద్ర డ్యాం నుంచి వాటా జలాలు విడుదల చేసినా.. తుంగభద్ర నదిలో దాదాపు 350 కిలో మీటర్లు ప్రవహించాల్సి రావడంతో సుంకేసుల బ్యారేజీకి 25 శాతం వాటా నీరు కూడా చేరడం లేదు. దీంతో కేసీ కాలువ చివరి ఆయకట్టు, కర్నూలు నగరంతో పాటు వివిధ గ్రామాలకు సాగు, తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ కష్టాలకు చెక్ పెట్టి.. కష్టజీవుల కన్నీళ్లు తుడవాలనే లక్ష్యంతో రాయలసీమ సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్బరాయుడు సుంకేసులు బ్యారేజీ ఎగువన తుంగభద్రపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవులు గ్రామ సమీపంలో అదనపు రిజర్వాయర్ (గుండ్రేవుల) నిర్మాణానికి ప్రతిపాదించారు. ఉమ్మడి రాష్ట్రం చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వేకు నిధులు ఇవ్వడం, ఆ వెంటనే హైదరాబాద్‌కు చెందిన ఆర్వే సంస్థ నది ఇరువైపుల ఏపీ, తెలంగాణ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేసి రూ.2,890 కోట్లకు సవివర ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) ఇచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కేసీ ఆయకట్టుకు సాగునీరు, కర్నూలు నగరానికి తాగునీటి పాటు జలాశయం ఎగువన కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలో గురురాఘవేంద్ర, పులికనుమ ఎత్తిపోతల పథకాల ద్వారా తాగు, సాగునీరు అందే అవకాశం ఉంది.

గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2,980 కోట్లు మంజూరు

రాష్ట్ర విభజన తరువాత అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం మొదట్లో గుండ్రేవుల జలాశయంపై దృష్టి సారించలేదు. ఈ ప్రాజెక్టు కోసం రాయలసీమ సాగునీటి సమితి ఆధ్వర్యంలో రైతులు నిరసనలు, కర్నూలు నుంచి గుండ్రేవులకు పాదయాత్ర చేశారు. 2019 ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. అదే సమయంలో కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిన ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి గుండ్రేవుల మంజూరు చేయాలనే షరతు పెట్టారు. 2019 ఫిబ్రవరి 21న రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ నాటి టీడీపీ ప్రభుత్వం జీవో ఆర్టీ నం.154 జారీ చేయడమే కాకుండా కోడుమూరు పర్యటనలో సీఎం చంద్రబాబు నిధులు మంజూరు శిలాఫలకం వేశారు. ఎట్టకేలకు గుండ్రేవుల జలాశయానికి తొలి అడుగు పడింది.

మిగతా 6వ పేజీలో



తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం ప్రతిపాదిత ప్రాంతం

గుండ్రేవులకు కదలిక



2019 ఫిబ్రవరిలో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శిలాఫలకం వేసిన అప్పటి సీఎం చంద్రబాబు

5వ పేజీ తరువాయి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్ గుండ్రేవుల జలాశయం నిర్మిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టారు. అదే క్రమంలో తెలంగాణలో జగన్‌కు సన్నిహితంగా ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉండడడంతో గుండ్రేవులపై సీమ రైతులకు ఆశలు రెట్టింపు అయ్యాయి. అయితే.. తెలంగాణతో కనీసం చర్చలు జరపకపోగా ఇది అంతర్రాష్ట్ర సమస్య అంటూ జగన్ ప్రభుత్వం అటకెక్కించారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది.

రైతుల్లో చిగురించిన ఆశలు

కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో గుండ్రేవుల జలాశయం నిర్మించి కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల రైతుల కన్నీళ్లు తుడవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఏకరువు పెట్టారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. మూడేళ్లలో ప్రాజెక్టు చేపడుతామని అసెంబ్లీ సాక్షిగా జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారు. అందులో బాగంగానే ఈ ప్రాజెక్టుపై తమ అభిప్రాయాలు చెప్పాలని కోరుతూ సవివర ప్రాజెక్టు రిపోర్టును కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు, కేఆర్ఎంబీలకు పంపించారు. కదలిక రావడంతో సీమ రైతుల్లో ఆశలు రెట్టింపయ్యాయి. కాగా.. వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణం అంచనా వ్యయం రూ.5,500 కోట్లకు పైగా చేరిందని ఇంజనీర్లు తెలిపారు.

35 టీఎంసీలకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన

తమ రాష్ట్రం పరిధిలో ముంపునకు గురయ్యే భూములు పరిహారంపై స్పష్టత ఇవ్వాలని, ప్రాజెక్టుపై ఎలాంటి అభ్యంతరం లేదని కర్ణాటక వివరించినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం మాత్రం గుండ్రేవులను ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టి, సామర్థ్యం 35 టీఎంసీలకు పెంచి.. 20 టీఎంసీలు ఏపీ, 15 టీఎంసీలు తెలంగాణలోని ఆర్డీఎస్ ఉడమ కాలువ ఆయకట్టుకు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. అధికారికంగా ఏపీ ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉంది. అయితే.. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చలు జరపడం ద్వారా ఈ ప్రాజెక్టు నిర్మాణం ఓ కొలిక్కి వస్తుందని సాగునీటి నిపుణులు అంటున్నారు. కాగా.. సామర్థ్యం 35 టీఎంసీలకు పెంచడం సాధ్యమేనా..? అనే చర్చ జరుగుతోంది.

గుండ్రేవుల జలాశయం 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తే ముంపునకు గురయ్యే గ్రామాలు, భూములు (హెక్టార్లల్లో) వివరాలు

వివరాలు	ఏపీ	తెలంగాణ
ప్రభుత్వ భూములు	1,720.40	924.70
ప్రైవేటు భూములు	4,445.74	2,078.54
మొత్తం భూములు	6,166.15	3,003.24
ముంపు గ్రామాలు	8	3
పాక్షికంగా ముంపు గ్రామాలు	4	2

కాయ కాయకూ కవచం

మామిడి సాగులో చాలా ఆటుపోట్లు ఉంటాయి. చేతికి వచ్చిన కాయ చీడ పీడలకు, ఎండ తీవ్రతకూ దెబ్బతినే ప్రమాదం ఉంది. భారీగా పెట్టుబడి పెట్టినా చివరాఖరికి అనుకోని నష్టాలతో రైతులు కుదేలవుతారు. వీటన్నిటికి ఒక చిన్న పరిష్కారంగా కాయ కాయకూ కవర్ విధానం ముందుకు వచ్చింది. ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా ఈ కవర్లను రాయితీపై రైతులకు అందజేస్తోంది.

- మామిడికాయల రక్షణలో కొత్త విధానం
- వేడిమి, చీడపీడల బెడదకు పరిష్కారం
- నాణ్యమైన కాయ దిగుబడి
- ఈ రకం మామిడికి మార్కెట్లో మంచి డిమాండ్



ఏనుగమర్రి గ్రామంలో మామిడికి రైతులు ఏర్పాటు చేసిన కవర్లు

ప్యాపిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలంలో అధికంగా రైతులు మామిడిని సాగుచేస్తున్నారు. ప్యాపిలి, వెంగళాంపల్లి, పోతుదొడ్డి, ఏనుగమర్రి, మాందొడ్డి, కలచట్ల, ఎర్రగుంట్లపల్లి, గుడిపాడు తదితర గ్రామాల్లో రైతులు మామిడి కాయలకు రక్షణ కవర్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా కొంత మంది రైతులు కవర్లు ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది అందరు కవర్లను వినియోగిస్తామని మామిడి రైతులు తెలియజేస్తున్నారు. ఈ విధానం వల్ల చీడపీడల బెడద పూర్తిగా తగ్గుతుంది. ఎండ వేడికి కాయ తట్టుకుంటుంది. మంచి రంగుతో దిగుబడులు ఉంటాయి. నిర్వాహణ ఖర్చులు తగ్గుతాయి. ఇతర కాయలతో పోల్చితే ఇలా విడి విడిగా కవర్లు ఏర్పాటు చేసిన కాయల సైజ్ పెద్దగా ఉంటుంది. ఈ నాణ్యత మామిడి ప్రియులను ఇట్టే ఆకర్షిస్తాయని రైతులు చెబుతున్నారు. కవర్లు వినియోగించిన మామిడి కాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని రైతులు, అధికారులు తెలుపుతున్నారు.



కవర్ల ఏర్పాటుతో వచ్చిన నాణ్యమైన దిగుబడి

ప్రభుత్వం రాయితీపై కవర్ల పంపిణీ

మామిడి రక్షణకు వాడే కవర్లను ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తుంది. మార్కెట్లో ఒక్కో కవరు రూ.2 నుంచి రూ.3 ధర పడుతుంది. అందులో సగం రాయితీకి ప్రభుత్వం అందజేస్తోందని అధికారుల తెలియజేస్తున్నారు. కవర్ల నియోగంపై అవగాహన లేనందున రైతులు ఈ ఏడాది తక్కువగా వినియోగించారని, వచ్చే ఏడాది కవర్లు వినియోగించడానికి అధిక సంఖ్యలో రైతులు ముందుకు వస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.



మంచి దిగుబడి వచ్చింది



రెండు ఎకరాల్లో మామిడి కాయలకు కవర్లు వినియోగించాను. ఇతర చెట్లతో పోలిస్తే కవర్లు ఏర్పాటు చేసిన చెట్లకు మంచి పంట దిగుబడులు వచ్చాయి. ఈ రకం మామిడికి మార్కెట్లో కూడ మంచి ధరలు ఉంటాయి. మామిడి రైతులందరూ కవర్లు వినియోగిస్తే మంచిది.

పుల్లారెడ్డి, మామిడి రైతు, పోతుదొడ్డి, ప్యాపిలి మండలం

రక్షణ కవర్లతో అధిక లాభాలు:



మామిడికి రక్షణ కవర్లు వినియోగించడం వలన అధిక లాభాలు ఉన్నాయి. వేడిమి, చీడపీడల బెడద తగ్గుతుంది. దీంతో రైతులకు నిర్వాహణ ఖర్చులు తగ్గుతాయి. కాయలపై మచ్చలు లేకుండా నాణ్యంగా ఉంటాయి.

-కళ్యాణి, ఉద్యానవనశాఖ అధికారి, ప్యాపిలి

కాకతీయ శిల్ప కళా చిత్రానికి విశేష స్పందన



ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకుంటున్న చిత్రకారుడు కోటేష్

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో తాను చిత్రించిన కాకతీయ శిల్ప కళా చిత్రానికి విశేష స్పందన లభించిందని ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టార్చ్, కళాయజ్ఞం బృందంతో హైదరాబాదులోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ శిలా నిశబ్దం పేరిట జరిగిన చిత్రకళా ప్రదర్శనలో తన చిత్రానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన ఈ ప్రదర్శనలో 50మంది ప్రముఖ చిత్రకారులు, చిత్రకారిణిలు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

నాటక కళాకారులకు వీరేశలింగం పురస్కారాలు

ప్రభుత్వంచే రాష్ట్రస్థాయి, జిల్లా ప్రతిష్టాత్మక గుర్తింపు



డాక్టర్ రవికృష్ణ



పసుపులేటి రత్నకుమార్



మంతం శంభుప్రసాద్



దాసరి రామసుబ్బయ్య

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్ 16 కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకొని నాటక కళారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా పలువురు కళాకారులకు కందుకూరి రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేస్తుంది. పురస్కార గ్రహీతల్లో నంద్యాలకు చెందిన డాక్టర్ గుర్రాల రవికృష్ణ ఒకరు. రవికృష్ణకు విజయవాడలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందజేయనున్నారు. డాక్టర్ గుర్రాల రవికృష్ణకు రాష్ట్రస్థాయి పురస్కారంతో పాటు రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, అలాగే జిల్లా స్థాయి పురస్కారాలలో నంద్యాల జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు పీఎస్ రత్నకుమార్, సీనియర్ రంగస్థల నటులుగా ప్రతిభ కనబరుస్తున్న నంద్యాల జిల్లా గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన మంతం శంభుప్రసాద్, బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెకు చెందిన రామసుబ్బయ్యకు పదివేల రూపాయల నగదు, జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ జిల్లా స్థాయి పురస్కారం రావడం చాల సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన కళారాధన నిర్వాహకులు డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శి ఎస్ఎస్ఆర్ ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సుశమీంద్రతీర్థులకు భక్తుల నీరాజనాలు

- బంగారు రథంపై ఊరేగిన స్వామివారు
- టీటీడీ నుంచి పట్టు వస్త్రాల సమర్పణ



బంగారు రథంపై విహరిస్తున్న సుశమీంద్రతీర్థులు

మంత్రాలయం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి పూర్వ పీఠాధిపతి సుశమీంద్రతీర్థులకు భక్తులకు పెద్ద ఎత్తున నీరాజనాలు పలికారు. దేశ నలుమూలల నుంచి సుశమీంద్రతీర్థుల మహాసమారాధన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన పరమ గురువుల బృందావనానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక అభిషేకాలు, హారతులు ఇచ్చి బంగారు, వెండి ఆభరణాలతో అలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య సుశమీంద్రతీర్థుల చిత్రపటాన్ని బంగారు రథంలో అధిష్ఠించి, పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చి ఊరేగించారు. అంతకుముందు టీటీడీ చైర్మన్ ఆదికేశవుల నాయుడు నుంచి అధికారికంగా సమర్పించే టీటీడీ పట్టువస్త్రాలను టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్‌రావు, అర్చకులు కేఎస్ గౌరి శంకర్ శర్మ పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మఠం దివాన్ శ్రీనాథ్, సుజీంద్రాచార్, బండాచార్, ధనుష్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి పాల్గొన్నారు.



టీటీడీ నుంచి వచ్చిన పట్టువస్త్రాలను తీసుకువస్తున్న పీఠాధిపతి

జీవితమే వారికి ఒక నాటకం..!

- ప్రోత్సాహకాలకు ఎదురుచూస్తున్న నాటకరంగ కళాకారులు
- కూటమి ప్రభుత్వంలో ఉగాది, కందుకూరి పురస్కారాలపై హర్షం
- నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం



బాలనాగమ్మ పౌరాణిక నాటకంలోని ఓ దృశ్యం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'అవిగో వినరా ఆ చప్పట్లు.. ఆధ్వని తరంగాలే కదురా ఆకలిగొన్న కళాజీవికి పంచభక్ష్య పరమాన్నాలు' అంటాడు ప్రముఖ సినీ కవి ఆత్రేయ. నాటకమేదైనా, పాత్రలేవైనా అందులో లీనమై జీవించే కళాకారులకు నాటకం చివర ప్రేక్షకులు కొట్టే చప్పట్లే గొప్ప సత్కారాలుగా భావిస్తుంటారు. జిల్లాలో ఆధునిక కాలంలో 1940 దశకం నుంచి నాటకరంగం తన ఉనికిని చాటుకుంటోంది. అప్పట్లో ఉమ్మడి జిల్లాలోని నంద్యాల, పత్తికొండ ప్రాంతాల్లో టెంట్లు వేసి నాటకాలు నెలల కొద్దీ ఆడేవారు. పద్య నాటకరంగానికి జిల్లా పెట్టింది పేరు. అల్లాబకాష్, వెల్దుర్తి వెంకటనర్సునాయుడు, రజనీబాయి, సింహం లక్ష్మీనారాయణ, బిక్కి కృష్ణ వంటి ఎందరో మహనీయులు జిల్లా నాటకరంగ ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో చాటి చెప్పారు. ఒకప్పుడు సురభి నాటక సమాజాలు సినిమా సెట్టింగ్‌లను తలపిస్తూ ప్రేక్షకులను అలరింపజేసేవి. కానీ నేడు అరకొరగా ప్రదర్శనలు ఇస్తున్నాయి. సీఎం నారా చంద్రబాబునాయుడు నాటక రంగానికి కూడా నందులు ప్రవేశపెట్టారు. అలా 2010లో నంద్యాల టౌన్ హాలులో, 2017లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో నంది నాటక పోటీలు జరిగాయి. రాష్ట్రంలో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇటీవల ఉగాది రోజున జిల్లాకు చెందిన పలువురు సీఎంతో పురస్కారాలు అందుకున్నారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007నుంచీ తెలుగు నాటక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కందుకూరి జయంతిన రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కందుకూరి పురస్కారాలు జిల్లాకు చెందిన ఐదుగురు కళాకారులు బుధవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో అందుకోనున్నారు.

నంది నాటకపోటీలపై ఆసక్తి

రాష్ట్రంలో నాటక కళాకారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నంది నాటక పోటీలను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం చంద్రబాబునాయుడు సినీ కళాకారులతోపాటూ, నాటక రంగ కళాకారులకు నంది బహుమతులు ప్రవేశ పెట్టారు. దీంతో రాష్ట్రంలో ఈరంగాన్ని నమ్ముకొన్న వేలాది మందికి ఉపాధి లభించింది. కళాకారులే కాకుండా, సెట్టింగులు వేసేవారు, మేకప్ ఆర్టిస్టులు, రవాణా సహాయకులు తదితరులకు పరోక్షంగా పని లభిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని ప్రైవేటు నాటక సమాజాలు మాత్రమే నాటకాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రోత్సహిస్తున్నాయి. ఈఏడాది ఉగాది పురస్కారాలతో మొదలైన రంగస్థల కళాకారుల ప్రోత్సాహకాలు కందుకూరి పురస్కారాలు సేదదీరుస్తున్నాయి.

తెలుగు నాటకరంగ దినోత్సవం ఆవిర్భావం ఇలా..

తొలి నాటక సమాజాన్ని స్థాపించిన వీరేశలింగం పంతులు జయంతి రోజున నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001లో తెలుగు నాటక దినోత్సవం నిర్వహించారు. 2007 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేస్తూ 2007 ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటక దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా కందుకూరి జయంతి రోజున కందుకూరి రాష్ట్ర, జిల్లా పురస్కారాలు అందజేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఐదుగురు కళాకారులకు ఒక్కోక్కరికీ రూ. లక్ష చొప్పున, జిల్లా స్థాయిలో ఐదు మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నారు. అలాగే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

జిల్లాస్థాయిలో కందుకూరి పురస్కార గ్రహీతలు వీరే..

రాష్ట్ర ప్రభుత్వం తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ఐదుగురు కళాకారులకు బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'కందుకూరి పురస్కారాలు' మంగళవారం సాయంత్రం ప్రకటించింది. జిల్లా స్థాయిలో ప్రకటించిన ఈ పురస్కారాల్లో ప్రముఖ హార్మోనిస్టు ఎర్రమ పాండురంగయ్య, రంగస్థల నటులు జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, రంగస్థల నటీమణులు ఎంఆర్ రాధిక, రామదుర్గం వనారస్ మంజుల అందుకుంటున్నారు. టీజీవీ కళాక్షేత్రంలో కళాకారులుగా రాణిస్తున్న వీరిని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అభినందించారు.

ప్రభుత్వ చేయూత అవసరం



నాటక రంగ పురోభివృద్ధికి ప్రభుత్వం చేయూత ఎంతో అవసరం. ఇది ఒకరిద్దరి వల్ల అయ్యేది కాదు. రాష్ట్రంలో కొన్ని నాటక పరిషత్‌లు నాటక పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. అందుకే నాటకం జీవించే ఉంది. ఇక ప్రభుత్వం వల్ల నాటక రంగానికి విస్తృత స్థాయిలో ప్రచారం, ప్రాచుర్యానికి అవకాశాలు ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రత్యేకంగా థియేటర్లు నాటక ప్రదర్శనలకు అందుబాటులో ఉంటాయి. తెలుగు నాటకాలకు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం ప్రతినెలా నాటక ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలి.

- పత్తి ఓబులయ్య, నాటక దర్శకుడు, కళారత్న అవార్డు గ్రహీత

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శిరివెళ్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు. వివరాలు.. ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లెకి చెందిన దివాకర్‌రెడ్డి(37) అనే వ్యక్తి సోమవారం రాత్రి బైక్‌పై నంద్యాలకు వెళ్తున్నాడు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో దివాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీ.. యువకుడి మృతి

బనగానపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరుకి చెందిన చాకలి మస్తాన్(23)ను ట్రాలీ ఆటో ఢీ కొట్టి మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శీలయ్య బంధువు బాలాజీతో కలిసి టంగుటూరులో పనులు ముగించుకొని బైక్‌పై వస్తున్నాడు. చెరువుపల్లె గ్రామం దాటాక ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో వచ్చి ఢీకొట్టింది. మస్తాన్, బాలాజీకి తీవ్రగాయాలయ్యాయి. నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మస్తాన్ మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరు..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోడుమూరు రహదారి వైజంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన మహేశ్వరరెడ్డి(44) బైక్‌పై పెద్దపాడు నుంచి బళ్లారిచౌరస్తా వైపు వస్తున్నాడు. వై.జంక్షన్ వద్ద ఓ ఆటో అతివేగంగా వచ్చి అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పాటు అదే రోడ్డులో వెళ్తున్న ట్రాలీ ఆటోతో పాటు రోడ్డుపక్కన నిలిచి వున్న మరో ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్వరరెడ్డికి తీవ్ర గాయాలు పాలయ్యాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ట్రాక్టర్ చక్రానికి చీర చుట్టుకొని..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో సుంకేసుల రోడ్డులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ మహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. రాజోలికి చెందిన సుగుణమ్మ అనే మహిళ తన భర్త శేఖర్‌తో కలిసి కర్నూలుకు మంగళవారం వచ్చింది. ఆటోలో తిరిగి రాజోలికి బయలుదేరింది. ఎదురుగా ఇసుక ట్రాక్టర్ వేగంగా వచ్చింది. ఆటోలో ప్రయాణిస్తున్న సుగుణమ్మ చీర ట్రాక్టర్ టైర్‌కు చుట్టుకుంది. దీంతో ఆమెను ట్రాక్టర్ కొద్ది దూరం వరకు ఈడ్చుకెళ్లింది. భర్త శేఖర్ భార్యను కాపాడేప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. ఈ ప్రమాదంలో ఆమె మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షాహిరా (32) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం జరిగింది. బనగానపల్లె పట్టణానికి చెందిన మాబూసాహెబ్, నూర్జహాన్ కూతురు షాబీరాను 10 ఏళ్ల క్రితం బనగానపల్లె పట్టణానికి చెందిన రఫీ అను వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య గొడవలున్నాయి. ఈ నేపథ్యంలోనే పట్టణంలోని రాంభూపాల్‌నగర్‌లోని ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో షాహిరా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చస్తున్నట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

రుద్రవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురికి ఆళ్లగడ్డ జేఎంఎఫ్‌సీ జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామన్నారు.

కిరాణ దుకాణం దగ్ధం

బనగాన పల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె రహదారిలోని షిరిడి సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న మహేశ్వరి అనే మహిళకు చెందిన కిరాణ దుకాణం మంగళవారం దగ్ధమైపోయింది. దాదాపు రూ. 3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా లేక గుర్తుతెలియని ఆగంతకులు నిప్పు పెట్టారా తేలాల్సి ఉంది. పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితురాలు కోరుతున్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డీమార్టు వెనక టీడీపీ కార్యాలయంపై దాడిచేసిన కేసులో నిందితులు ప్రభాకర్ నాయుడు, కాశీ, రహంతుల్లా, సలాంఖాన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ మధుసూదన్‌గౌడు, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులు టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన శేఖర్‌గౌడు, మరికొంత మందిని వేటుకొడవళ్లు, కత్తులతో చంపేందుకు ప్రయత్నించారని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరు..

మంత్రాలయం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమాన్‌దొడ్డితండా గ్రామంలో మారెమ్మదేవాలయంలోని హుండీ చోరీ కేసును మాధవరం ఎస్‌ఐ విజయకుమార్ ఛేదించాడు. ఈ నెల 13వ తేదీన ఆలయంలో హుండీని చోరీకి పాల్పడటంపై పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైన విషయం తెలిసిందే. పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన చిన్న ఈరన్న, కౌతాళం మండలం ఉరుకుందుకి చెందిన జోగి లక్ష్మన్న అనే ఇద్దరు హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.2వేల నగదును దోచుకెళ్లారు. చోరీకి పాల్పడిన సమయంలో ఉపయోగించిన వస్తువులతో పాటు ఇద్దరిని సుంకేశ్వరి క్రాస్ రోడ్డు వద్ద మంగళవా రం అరెస్టుచేసినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. వీరిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ జరిగిన రెండు రోజుల్లోనే కేసును ఛేదించడంతో సీఐ రామాంజులు మాధవరం ఎస్‌ఐ, సిబ్బందిని అభినందించారు.

అనుచిత వ్యాఖ్యల కేసులో ముగ్గురు..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆయన సతీమణి, కుమారుడిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో గుంటూరు పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గూడూరుకు చెందిన పుష్పరాజ్, ఉదయ్‌కిరణ్, ఫయాజ్‌ను అదుపులోకి తీసుకుని గుంటూరుకు తరలించినట్లు తెలిసింది.

పోక్సో కేసు నమోదు

డోన్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డోన్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైందని అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. వివరాలు.. డోన్ పట్టణంలో ఓ తొమ్మిదేళ్ల బాలిక తన దగ్గరి బంధువు సోమవారం కొత్త బట్టలు కొనిస్తానని చెప్పి బైక్‌పై బాలికను పట్టణ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై లైంగిక దాడి చేశాడు. అనంతరం ఆబాలికను ఇంటికి తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జపాన్ పర్యటనకు కర్నూలు ఎస్పీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మే నెలలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. మే 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఎస్పీ జపాన్ పర్యటన ఖరారైంది. సొంత కార్యక్రమాల మీద ఈ పర్యటన ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీకి సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రాయలసీమ కళలకు కాణాచి

- మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్
- కళాకారులకు ప్రోత్సాహం అవసరం: బీసీ రాజారెడ్డి
- 12 మంది కళాకారులకు కందుకూరి అవార్డులు ప్రదానం
- ఘనంగా తెలుగు నాటకరంగ దినోత్సవం


మాట్లాడుతున్న టీజీ వెంకటేష్


సత్యహరిశ్చంద్ర నాటకంలోని ఓ సన్నివేశం


శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని ఓ దృశ్యం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ కళలకు కాణాచి అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీ వెంకటేశ్, గౌరవ అతిథులు బనగానపల్లె అరుణభారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి, ప్రముఖ వైద్యుడు బి. శంకరశర్మ, ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా బ్రాంచ్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వారు కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ రాయలసీమ కళలకు కాణాచి అని అన్నారు. చల్లా నవీన్‌కుమార్ తనను కలిసి టీజీవీ కళాక్షేత్రంలో సత్య హరిశ్చంద్ర నాటకం వేస్తున్నామని ఆహ్వానించారని, ఆయన ప్రదర్శన తిలకించేందుకు ప్రత్యేకంగా వచ్చానని అన్నారు. కొత్తగా నాటకాలు వేస్తున్న చల్లా నవీన్‌కుమార్, కేవీ రమణ భవిష్యత్తులో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

మరో అతిథి బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో కవులు, కళాకారులు ఉన్నా వారికి ప్రోత్సాహం అందడం లేదని, తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర చాలా కీలకంగా పని చేసిందని అన్నారు. డాక్టర్ బి. శంకరశర్మ మాట్లాడుతూ నూతన కళాకారులు నాటకంపట్ల మక్కువతో కళారంగంలో ప్రవేశించడం అభినందనీయమని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ యువ కళాకారులకు టీజీ కళాక్షేత్రం ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు.

కళాకారులు, కందుకూరి పురస్కార గ్రహీతలకు సత్కారం...

సత్య హరిశ్చంద్ర నాటక కళాకారులు చల్లా నవీన్‌కుమార్ నాయుడు, ఎంఆర్ రాధిక, హార్మోనిస్టు ఎర్రమ పాండురంగయ్య, అలాగే శ్రీకృష్ణ రాయబారం నాటకం ప్రదర్శించిన జీవీ శ్రీనివాసరెడ్డి, కేవీ రమణ, కె. బాలవెంకటేశ్వర్లు, హార్మోనిస్టు బలరాంలను మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, బీసీ రాజారెడ్డి, డాక్టర్ బి. శంకరశర్మ, ఆకుల లక్ష్మణ్ ఘనంగా సత్కరించారు. అలాగే టీజీవీ కళాక్షేత్రం ప్రకటించిన కందుకూరి అవార్డులు సంగీత గురువులు పీజీ వెంకటేశ్వర్లు, జేఎం రాజశేఖర్‌రాజు, లక్ష్మన్న, కేశవులు,టి.ఎస్. ధనుంజయ్, పి. రామలింగం, ఎస్ రామకృష్ణారెడ్డి, జే. మహేశ్వరయ్య, బందేగౌడ, బలరాం నాయుడు, చల్లా నరసింహనాయుడు, కేబీ నాగప్పలకు అందజేసి వారికి శాలువ, జ్ఞాపిక, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా అరుణభారతి సంస్థ తరపున బీసీ రాజారెడ్డి కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం ప్రతినిధులు మహమ్మద్ మియా, ఇనాయతుల్లా, పి. రాజారత్నం, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, సోమశంకర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

అటెండెన్స్‌ను తారుమారు చేశారు..

- మంత్రి లోకేశ్‌కు ఓ ఆఫీస్ సబార్డినేట్ ఫిర్యాదు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 2023 మార్చి వరకు సంవత్సరం పాటు కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఆఫీసు సబార్డినేట్‌గా పని చేశానని, తన బయోమెట్రీ హాజరును తారుమారు చేసి అన్యాయం చేశారని నగరంలోని ఆరోరా నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. 2022 సెప్టెంబరులో బయోమెట్రీ హాజరును తారుమారు చేస్తూ అప్పటి ఐ-హాస్పిటల్ సూపరింటెండెంట్ 26 రోజులు పని చేసిన 20 రోజుల వేతనం ఇచ్చారని పబ్లిక్ గ్రీవెన్స్ రిసిడెన్సి సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో మంత్రికి ఫిర్యాదు చేశారు. అప్పటి సూపరింటెం డెంట్ తనపై కల్పిత మెమో జారీ చేసి ఫోర్జరీ రికార్డులు పెట్టి జీతం రాకుండా చేశారని మాన్యువల్ అటెండెన్స్‌లో టాపయింగ్ చేసి అన్యాయం చేశారన్నారు. తనకు కోవిడ్‌కు సంబంధిత జీతం జమ చేయాలని ఉద్యోగం రాకుండా అప్పటి సూపరింటెండెంట్ అడ్డుకుంటున్నారని, ఫిర్యాదులో వివరించారు. ఈ నెల 9న ఐటీ మంత్రికి ఫిర్యాదు చేయగా.. డీఎంఈ ద్వారా కర్నూలు కలెక్టరేట్‌కు సమాచారం అందింది.

వీఆర్వోల బదిలీ

కోడుమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలోని పొలం విషయంలో హైమావతి అనే మహిళ నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూళ్లు చేయడంతో పాటు లైంగికంగా వేధించిన ఘటనపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వీఆర్వోలపై ఎట్టకేలకు బదిలీ వేటు వేశారు. కోడుమూరు మండలం పులకుర్తిలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో నారాయణను మంత్రాలయం మండలం మంచర్ల గ్రామానికి బదిలీ చేశారు. కోడుమూరులో విధులు నిర్వహిస్తున్న పరమేశ్వరుడును దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి, ప్యాలకుర్తి గ్రామంలో వీఆర్వోగా పని చేస్తున్న వెంకట్రాముడును నందవరం మండలం ముగతి గ్రామానికి బదిలీ చేశారు. కోడుమూరు డీటీ రామాంజనేయులను ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ బదిలీ వెనక ఎవరి హస్తం ఉంది. అందులోని ఆంతర్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

మెరిట్ జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోనిపట్టణ ఆరోగ్య కేంద్రాల్లోని ఫార్మాసిస్టు గ్రేడ్-2, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్ గ్రేడ్ సేలియస్ (ఎల్‌జీఎస్) పోస్టుల మెరిట్ లిస్టును ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో విడుదల చేశామని, డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్య ర్థులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వ తేదీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని వెల్లడించారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీకి జీవో విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్/నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల బోధనకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 240 పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఖాళీలను గుర్తించింది. ప్రతి 10 మంది ఉన్న దివ్యాంగుల పాఠశాలల్లో వారికి ప్రత్యేక శిక్షణనిచ్చే స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండలంటూ ఆయా ఖాళీలను ప్రభుత్వం గుర్తించింది, వాటిని డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ప్రైమరీ లెవల్లో 110 ఎస్జీటీ పోస్టులు, సెకండరీ లెవల్లో 130 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సృష్టిస్తూ వాటిని డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆటిజం సహా, మానసిక వైకల్యం కల్గిన వారికి విద్యను బోధించేలా ఈ ప్రత్యేక ఉపాధ్యాయులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం చేస్తూ జీవోను విడుదల చేసింది.

పలు రైళ్లు రద్దు

మద్దికెర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి- గుంతకల్లు 57403 నెంబరుగల రైలు ఈ నెల 16 నుంచి మే 18 వరకు, గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్లే 57404 నెంబరు గల రైలు బుధవారం నుంచి మే 19వరకు రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే తిరుపతి నుంచి కదిరి దేవరపల్లె 57405 నెంబరు గల రైలు ఈ నెల 15 నుంచి మే 16 వరకు, అలాగే కదిరి దేవరపల్లె-తిరుపతి 57406 రైలు ఈ నెల 15 నుంచి మే 17 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

30లోపు ఈకేవైసీ చేసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులోని ఈకేవైసీ పూర్తి చేయనివారు ఏప్రిల్ 30లోపు పూర్తి చేసుకోవాలని డీఎస్‌వో రాజా రఘువీర్ తెలిపారు. ఇంకాను 1,82,991 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈకేవైసీ పూర్తికానీ వ్యక్తి పేరు ఈపోస్ మెషిన్ నందు రెడ్ మార్క్‌లో సూచించబడి ఉంటుంది. ఎండీయూ, వీఆర్వో, సమీప సచివాలయం, డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

పెద్దయ్యపై దాడి చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు పెద్దయ్యనాయుడుపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వాల్మీకి సేవా సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన కృష్ణకాంత్ ప్లాజాలోని కారు పార్కింగ్‌లో పెద్దయ్య కారు పార్కింగ్ చేయరాదని వెంకటసుబ్బయ్య, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి హెచ్చరించారు. అంతేగాక ఆయనను కులంపేరుతో దూషించడంతో పాటు చంపడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారని తెలిపారు. వెంకటసుబ్బయ్య, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డితో పెద్దయ్యకు ప్రాణహాని ఉందని, త్వరలో ఎస్పీని కలిసి వారిపై ఫిర్యాదు చేస్తామని సంఘం నాయకులు తెలిపారు. కుబేరస్వామి, బేతంకృష్ణుడు, తలారీ కృష్ణ నాయుడు, కుంపటి కృష్ణ, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇన్‌చార్జి పీపీగా ప్రకాష్ రెడ్డి

కర్నూలు లీగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వై. ప్రకాష్ రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం కర్నూలు నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నారు. ఈ పదవితో పాటు ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ పీపీగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహిస్తారు.

జిల్లా హౌసింగ్ పీడీగా చిరంజీవి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీగా టి. చిరంజీవి నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే. విజయానంద్ జీవో.నెం.713 జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ కాగా, అందులో గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న చిరంజీవిని ఈ స్థానానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. గతంలోనూ చిరంజీవి హౌసింగ్ పీడీగా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఇన్‌చార్జి హౌసింగ్ పీడీగా ఉన్న అజయ్ కుమార్ తన మాతృ సంస్థ హెచ్ఎన్ఎస్ఎస్‌లో విధులు నిర్వహించనున్నారు.

ప్లాట్‌ఫారాలన్నీ రైతులకే..

- వ్యాపారులకు ఇచ్చేదే లేదు
- సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి
- వ్యాపారుల్లో మొదలైన గుబులు



ప్లాట్‌ఫారాలపై వ్యాపారులు నిల్వ చేసిన మిర్చి నిల్వలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రూ.లక్షలు ఖర్చు పెట్టి కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేసిన ప్లాట్‌ఫారాలను వ్యాపారులు కైవసం చేసుకుంటుండటంపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అయ్యాయి. తాము తెచ్చిన పంట ఉత్పత్తులను మండుటెండల్లో నిల్వచేస్తున్నా పట్టించుకోకుండా వ్యాపారులకు ప్లాట్‌ఫారా లను కేటాయించడంపై ఇదేమీ దారుణమంటూ కొన్ని రోజులుగా రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'వ్యాపారికి అండ.. రైతుకు ఎండ' అనే శీర్షికన ప్రచురితమైన కథనం కలకలం రేపింది. కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి స్పందించారు. యార్డులో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫారాలన్నీ రైతులకు సంబంధించిన పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికేనని స్పష్టంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాపారులకు వాటిని కేటాయించడం జరగదని స్పష్టం చేశారు. మిర్చి యార్డులో రైతులు తమ పంట ఉత్పత్తులను ప్లాట్‌ఫారాలపై నిల్వ చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని, అందువల్లనే వ్యాపారస్థులు తాత్కాలికంగా కొనుగోలు చేసిన మిర్చిని నిల్వ చేసుకుంటున్నారనీ వివరణ ఇచ్చారు. ఇకపై రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్లాట్‌ఫారాలపైన వారి పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని అమ్ముకునేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులు

నందికొట్కూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ ఆప్కాస్ కార్మికులకు జీవో నెం:36 ప్రకారం రూ.21 వేలు ఇవ్వాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పరమేష్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణలు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పరమేష్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు హామీలను వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75000 అమలు చేయాలని, దహన సంస్కారాలకు రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు, చాంద్‌బాష, రామయ్య, మారెన్న, సర్వర్ ఖాన్, రాము, మస్తాన్ వలి, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తీర్థావలితో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అశ్వవాహనంపై పారువేటకు వెళ్లి స్వామివారు మంగళవారం తెల్లవారుజాములు గజవాహనంపై గ్రామంలోకి ప్రవేశించారు. రథశాల వెనుకభాగంలో స్వామివారికి పూజలు చేసి భక్తులు పారువేట పద్యాలను భక్తులు ఆలకించారు. పండితులు స్వామివారి చరిత్ర, పారువేట విశిష్ఠతను భక్తులకు వివరించారు. అనంతరం స్వామివారిని దేవాలయంలోకి తీసుకెళ్లి పూజలుచేసి ఆశీనులను చేశారు. బ్రహ్మోత్సవాలు ముగియడంతో భక్తులు నేవేద్యాలు సమర్పించి పూజలు చేశారు.

అగ్నిప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ భీముడు నాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం స్థానిక గౌడ్‌సెంటర్‌లో అగ్నిమాపక వాహన విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాద సమయాల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

పెంచిన పన్నుల భారాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నుల భారాన్ని తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15శాతం అదనంగా ఆస్తి పన్నులను పెంచడం సరికాదని అన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులను పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే పన్నులను పెంచడం సరికాదని అన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, వీరన్న, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మే డేను జయప్రదం చేయండి

ఆత్మకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రానున్న మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మేడే స్ఫూర్తితో భవిష్యత్ కార్మికుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగించాలన్నారు. 8గంటల పనివిధానం కోసం అనేక పోరాటాలు సాగించి సాధించుకున్నామని అన్నారు. దేశంలో కార్మిక హక్కులకై 44కార్మిక చట్టాలను సైతం సాధించినట్లు చెప్పారు. మేడే వేడుకల్లో కార్మికులు, ఆయా కార్మిక సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటశివుడు, చాంద్‌బాషా, లల్లు, అహ్మద్‌హుసేన్, ముర్తుజాబీ తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలకు ఆహ్వానం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలమేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 50వేసవి క్రీడా శిక్షణాశిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఎంఎస్‌వి రాజు తెలిపారు. ఈ శిబిరాలు మే 1నుంచి 31వ తేదీ వరకు అన్ని క్రీడల్లో నిర్వహిస్తామన్నారు. నిబంధనల ప్రకారం 8నుంచి 14 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని క్రమంగా ప్రతి రోజు శిక్షణ కోసం ఎంపిక చేసి ప్రతిభ వెలికితీయాలన్నారు. శిక్షణా శిబిరాలు క్రీడా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్కూల్‌గేమ్ ఫెడరేషన్, ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు ఈ నెల 17లోపు పద్మావతినగర్‌లోని డీఎస్‌ఏ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేసవి శిక్షణా శిబిరాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా ఏదో ఒక క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్!

ఆర్టీసీ కార్గో కార్యాలయాలు అధ్వానం

- గతేడాది నంద్యాల జిల్లా ఆదాయం సుమారుగా రూ. 4.9 కోట్లు
- పట్టించుకోని అధికారులు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కార్గో సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టీసీ ఆధ్వర్యంలో పార్శిల్ విధానం వారి ఇంటి వద్దకే చేరే విధంగా ఆర్టీసీ చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల ఆర్టీసీకి ఆదాయం ఫుల్‌గా వస్తుంది. అయితే ఆర్టీసీ బస్టాండ్ల వద్ద పార్శిల్ కార్యాలయాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది అధికారులు, సిబ్బంది కుమ్మక్కై పార్శిల్లో వచ్చే వాటిని ఓపెన్ చేసి కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా మరో సారి ఈ పొరపాటు జరగనివ్వమని సర్దిచెప్పి పంపిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు.



నంద్యాల డిపోలో ఉన్న పార్శిల్ కేంద్రం

ప్రజా రవాణా సంస్థ అనుబంధంగా నడుస్తున్న కార్గో పార్శిల్ సేవలు ద్వారా సంస్థకు ఎక్కువ ఆదాయం వస్తున్నా కార్యాలయాల సౌకర్యాలు, కల్పించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఆదాయం విషయంలో సమీక్షలు చేసే అధికారులు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారు. జిల్లాలో బనగానపల్లె, కొవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల, ఆత్మకూరు, డోన్, నందికొట్కూర్ డిపోలు ఉన్నాయి. అన్నింటిలో కార్గో సేవలు నడుస్తున్నాయి. సరకులు బుక్ చేసిన 48 గంటల్లో రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఉన్న చేర వేస్తున్నారు. తక్కువ దూరంలో ఉన్న ప్రాంతాలకు బుక్ చేసిన రెండు మూడు గంటల్లోనే సరకులు గమ్యస్థానానికి చేరుతున్నాయి. దీంతో ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. కడప జోన్ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడల్లా అధికారులు కార్గో ఆదాయం పెంచాలని వాటి కోసం వ్యాపారస్తులను, కలిసి ప్రచారం చేయాలని, తప్పా ప్రజలకు కార్గో కార్యాలయల్లో సేవలు, సౌకర్యాలు పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా జిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండుల్లో ఉన్న కార్గో సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి.

కూర్చోడానికి కుర్చీలు లేవు..

ఆదనపు పార్శిళ్ల బుకింగ్‌కు ఏజెంట్లు జిల్లా వ్యాప్తంగా కార్గో కార్యాలయాల్లోతో పాటు ప్రైవేటు వ్యక్తులకు కమిషన్ పద్ధతిలో పార్శిళ్ల బుకింగ్ చేసే సౌకర్యం ఉంది. జిల్లాలో నంద్యాల డిపో పరిధిలో నంద్యాల పట్టణం, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లె వంటి ప్రాంతాలకు ప్రత్యేకంగా ఏజెంట్లు ఉన్నారు. దీంతో కార్గో సేవలు మరింత మెరుగుపరచాడానికి అవకాశం ఉన్న వినియోగదారులు కనీసం కుర్చీలు, నీటి వసతి, సరియైన సమాధానం చేప్పే వ్యక్తులు లేరు. కానీ ఆదాయం తీసుకుంటు ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో జిల్లా కేంద్రంలో ఇలా జరగడం ఏంటని పలువురు విమర్శిస్తున్నారు.

	వివరాలు ఇలా...
డిపో	సుమారుగా ఆదాయం
నంద్యాల	రూ.42 లక్షలు
కొవెలకుంట్ల	రూ.1.30లక్షలు నుంచి రూ.1.7లక్షలు
బనగానపల్లె	రూ.1.8లక్షలు నుంచి 2లక్షల వరకు
ఆళ్లగడ్డ	రూ.5లక్షల నుంచి రూ.5.2లక్షలు
ఆత్మకూరు	రూ.5.1 లక్షలు
డోన్	రూ.5.5 లక్షలు
నందికొట్కూరు	రూ.2.54లక్షలు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

నంద్యాల జిల్లా కార్గో సేవల్లో ఎవరైనా అమర్యాదగా ప్రవర్తించిన, వారు బుక్ చేసుకున్న పార్శిల్‌లో తక్కువగా ఉన్న వాటిని గమనించి వినియోగదారులు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. పార్శిల్ వచ్చిన వెంటనే తప్పకుండా చెక్ చేసుకోవాలి. ఎటువంటి ఇబ్బందులు ఉన్న ఫిర్యాదులు చేయాలి.

- రజీయా సుల్తానా, ఆర్ ఎం

జిల్లాలో ఇలా...

నంద్యాల జిల్లాలో ఏడు డిపోలు ఉన్నాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూర్, బనగానపల్లె, ఆత్మకూరు, కొవెలకుంట్ల, డోన్ ఉన్నాయి. వీటిలో ఏడాదికి సుమారుగా రూ. 4.9 కోట్లు ఆదాయం వస్తుంది. కానీ సౌకర్యాలు మాత్రం అరకొరగా చేస్తున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఆదాయంతో పాటు వారికి కల్పించే సౌకర్యాలపై కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్మకూరులో చిన్నదిగా ఉన్న పార్శిల్ కేంద్రం

ఈఓఆర్‌డీ హోదాపై హర్షం

పాణ్యం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈఓఆర్‌డీలకు డిప్యూటీ ఎంపీడీవో హోదా కల్పించడంపై నంద్యాల జిల్లా డిప్యూటీ ఎంపీడీవోల సంఘం అధ్యక్షులు చంద్రమౌళీశ్వరగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెంబరు 35 జారీ ద్వారా ఈఓఆర్‌డీలకు హోదా కల్పించడం జరిగిందన్నారు. ఈ హోదా వల్ల ప్రజలకు మరింత సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై పర్యవేక్షణ చేసే అవకాశం లభించిందన్నారు. హోదా కల్పించిన ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి

గోస్పాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడులో జొన్న పంటకు మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాన్ని ఎస్ఎండి ఫయాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 వేల క్వింటాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. గోస్పాడు మండలం నుంచి నాలుగు వేల క్వింటాలు కొనుగోలు చేస్తామని అన్నారు. ఎకరాకు 20 క్వింటాలు చొప్పున క్వింటాకు ప్రభుత్వ ధర రూ3371 ప్రకారం కొనుగోలు జరుగుతుందని అన్నారు. ఈకేవైసి చేసుకున్న ప్రతి రైతు నుంచి కొనుగోలు చేస్తారని ఎలాంటి పైరవీలు ఉండవన్నారు. మండలంలో 2017 మంది రైతులు 6544 ఎకరాలలో జొన్న పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెప్పారని వాటిని అన్నింటిని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆయా గ్రామాలలోని రైతు కేంద్రాలలో వ్యవసాయ అధికారులను కలిసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపి మండల కన్వీనర్ తులశీశ్వరరెడ్డి, జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాధరెడ్డి, టీడీపి నాయకులు జూపల్లె రాంగోపాల్‌రెడ్డి, ఓబులరెడ్డి, శీలం భాస్కరరెడ్డి, ఇసుకపల్లె ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులతో పాఠశాల యజమానులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాజీకాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ పాఠశాలల్లో పీపీ 2 చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం సుధాకర్, రమ్యారెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాగత నృత్యం, స్నో డ్యాన్స్, మిర్రర్ ఇమేజ్, బెలూన్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలతో చిన్నారులు అలరించారు. పీపీ 2 పూర్తి చేసిన విద్యార్థులకు విభాగాల వారీగా ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, హ్యాండ్‌మేడ్ గిఫ్ట్‌లను అందజేశారు. పాఠశాల ఛైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఒక కొత్త అధ్యయనానికి నాంది పలికే రోజు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తక్కువ వర్షంతో అధిక దిగుబడులు

కొత్తపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ వర్షపాతంలో కూడా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి (ఏఈవో) నాగశ్రీ సూచించారు. మంగళవారం మండలంలోని లింగాపురంలో రైతు పుల్లారెడ్డి పొలంలోని నాలుగెకరాల విస్తీర్ణంలో నవధాన్యాల సాగు కార్యక్రమంలో ఏఈవో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 365 రోజులు భూమిని పంటతో కప్పి పుచ్చినట్లయితే నవధాన్యాల సాగుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. అలాగే రైతులు పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్ డ్రై నీడింగ్) రైతులు నవధాన్యాలు, పచ్చరొట్టె, పప్పుదినుసులు, సాగు చేసుకున్నట్లయితే మంచి లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకున్నట్లయితే భూమి లో పోషకల భృత కూడా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఇమ్రాన్, నాగరాజు, సయ్యద్ బాషా, రాజు నాయక్, లింగస్వామి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

పాణ్యం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి మాజీ ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్ రూ. 74 వేలు అందజేశారు. మంగళవారం ఆయన పాఠశాల హెచ్‌ఎం మేరీసునీతకు విరాళాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు మట్టిలో కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తుండడం చూడలేకపోయినట్లు తెలిపారు. పరిస్థితి గమనించి పాఠశాల సిబ్బంది, అధికారులతో చర్చించి భోజనం చేయడానికి షెడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈమేరకు షెడ్డు నిర్మాణానికి అవసరమైన సహకారం అందించడానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా షెడ్డు నిర్మాణ కూలీలకు అవసరమైన రూ. 74 వేలు హెచ్‌ఎంకు అందజేశారు. కాగా ఇప్పటికే పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రికి రూ. 40 వేలు విరాళంగా అందించినట్లు ఎంఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో నందికొట్కూరు విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి కుమారులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం జిలానీబాషా, ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డీఆర్వో రామునాయక్ అధికారులను ఆదేశించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలుచేసేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఆయన చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మొదటి విడతలో 26,785మంది నిరక్షరాస్యుల్లో 23,861మంది అక్షరాస్యులుగా తీర్చిదిద్దగా వారికి పరీక్షలు నిర్వహించడంతో 23,224మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రెండోవిడతలో 30,443మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామని, ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో స్వయంసహాయక సంఘాల పరిధిలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వయోజన విద్య ఉపసంచాలకులు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, నిర్దేశిత ఉద్యోగులు భాగస్వాములై లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. 2వ విడత ఉల్లాస్ కార్యక్రమం ఈ నెల 16నుంచి ఆరురోజులపాటు సర్వే మొదలుపెట్టి నిరక్షరాస్యులను గుర్తించాల్సిఉందని దానిపై దృష్టి సారించాలన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఓ జమీవుల్లా, డీఎల్‌డీవో శివారెడ్డి, మెప్మా మేనేజర్ రాములు, డీఈవో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు మోహన్‌రెడ్డి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తర్తూరు జాతర సందర్భంగా నిర్వహించిన సీనియర్ విభాగం రాష్ట్రస్థాయి పెద్దబండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. మంగళవారం పోటీలను సీనియర్ టీడీపీ నాయకులు మాండ్రసురేంద్రనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి కలిసి ప్రారంభించారు. నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డికి చెందిన వృషభాలు నిర్ణయించిన వ్యవధిలో 2700 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచి రూ.70వేలు కైవసం చేసుకున్నారు. నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డి, అలగనూరు గ్రామానికి చెందిన రొలిమేడం చేరొక వృషభం పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచి రూ. 50వేలు, నంద్యాలజిల్లా హుసేనాపురం గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు తృతీయస్థానంలో నిలిచి రూ. 30వేలు గెలుచుకున్నారు. నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామానికి చెందిన కలాంబాషా వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ.20వేలు, నంద్యాల జిల్లా సీసంగతుల గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డికి చెందిన వృషబాలు ఐదో స్థానంలో నిలిచి రూ.10వేలు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన వృషభరాజుల యజమానులకు కమిటీ సభ్యులు నగదును అందజేశారు. కార్యక్రమంలో యాదవకార్పోరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, రమణారెడ్డి, శ్రీనివాసులు, దొరబాబురెడ్డి, రవికాంత్ ఆలయ ఛైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, ఉపాధి కూలీలు

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లోఉన్న 12వారాల వేతనాలు వెంటనే ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని నీడ, మెడికల్ కిట్ల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్‌లో నిధులు తగ్గించారని ఆరోపించారు. కూలీలకు వారం వారం క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలన్నారు. పథకంలో జరుగుతున్న అవకతవకలను నివారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్, స్వాములు, బాలయ్య, ఈశ్వరమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'చెరువును కాపాడాలి'

పాణ్యం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఓబులమ్మ చెరువు ఆక్రమణకు గురైనా మైనర్‌ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని, చెరువును కాపాడాలని ఆల్ ఇండియా యూత్ లీగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ కోరారు. మంగళవారం పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఓబులమ్మ చెరువును సర్వే చేయాలని కోరారు. వెంకటేష్, శేఖర్, కుమార్, రామ్, శివ పాల్గొన్నారు.

కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలి

నంద్యాల టౌన్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అప్కాస్ పని చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజినేయులు, రంగనాథ్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనరంతరం నాయకులు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో సుమారుగా 268 మంది పని చేస్తున్నారని అప్కాస్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. ఇటీవల మంత్రి వర్గం రద్దు చేయాలని ఆమోదం తెలిపిందన్నారు. చనిపోయిన కార్మికులకు నష్ట పరిహారం 7 లక్షలు చెల్లించాలని డిమాండు చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, లక్ష్మణ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

గోరుకల్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

పాణ్యం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టులో కీలకమైన గోరుకల్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సార్బీసీ ఆయకట్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రైతులు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తూ రాయలసీమలో చేపట్టిన ఏకైక ప్రాజెక్టు ఎస్సార్బీసీ అన్నారు. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఎస్సార్బీసీ ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ చేశారన్నారు. అప్పటి ప్రధాని పీవీ. నరసింహారావు సహకారంతో గోరుకల్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. తద్వారా లక్షా 94 వేల ఎకరాలలో సిరులు కురిపించే అవకాశం కల్పించారన్నారు. శ్రీశైలంలో నీరు ఉన్నపుడు బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా గోరుకల్లు వరకు కాలువ ద్వారా రోజుకు 2 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌లో నింపడానికి అవకాశం ఉందన్నారు. అయితే రిజర్వాయర్ భద్రత కారణాలతో సగం టీఎంసీ నీటినిమాత్రమే రిజర్వాయర్‌లోకి తీసుకువస్తున్నారన్నారు. గోరుకల్లు నిర్మాణం పూర్తి కాకపోవడంతో దాదాపు మూడు లక్షల ఎకరాల సాగు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రతి సంవత్సరం మూడు వందల కోట్ల రూపాయల వ్యవసాయ ఉత్పాదన జరగడమే గాక ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. ఈ సందర్భంగా పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్నరైతు సంఘం నాయకులు

వేతనాల కోసం ప్రజాప్రతినిధుల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎంపీటీసీలు

ప్యాపిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీటీసీ మెంబర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ మూడేళ్లుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. అలాగే పేరుకే ఎంపీటీసీలు గాని తమకు ఏనాడు ప్రభుత్వాలు నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తమపై అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ బుధవారం నిర్వహిస్తున్న మండల సమావేశానికి గైర్హాజరు కానున్నట్లు ఎంపీటీసీ లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు జయరామయ్య, భాస్కర్‌రెడ్డి, మద్దయ్య, రంగన్న, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత బేతంచెర్ల జట్టు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా గ్రామ పెద్దలు, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హోమ్ టీమ్స్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. బేతంచెర్ల కబడ్డీ జట్టు ప్రథమ విజేతగా నిలిచి రూ.10వేల నగదును సొంతం చేసుకుంది. రెండో విజేత ప్యాపిలి జట్టు నిలవగా రూ.8వేలు నగదును, మూడో విజేతగా రంగాపురం ఎంఎం టీమ్ రూ.6వేల నగదును కైవసం చేసుకుంది. నాలుగవ విజేతగా రూ.4వేలును ముద్దవరం జట్టు 5వ విజేత బుగ్గానపల్లె రూ.2వేల నగదును ఆరో విజేత రంగాపురం ఉదయ్ టీమ్ జట్టు రూ.1000లను సొంతం చేసుకుంది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

గజవాహనంపై చెన్నకేశవస్వామి



గజవాహన సేవలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణంలోని గౌరి పేట ఆంజనేయస్వామి దేవాలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి చెన్న కేశవస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. ఆయా వీధుల్లో స్వామివారికి భక్తులు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో మద్దిలేటి, ఈవీ మారుతి శర్మ, గౌరి హుశేన్ రెడ్డి,వెంకటరమణ, శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న కళలను వెలికితీయాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ కళాదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఆడించడం, పాటలు పాడించడం, డ్రాయింగ్, నృత్యం, సంగీతం, డ్రాయింగ్ వంటివాటిని చేస్తూ నూతనోత్సాహం నింపారు. అనంతరం విద్యార్థులు వేసిన డ్రాయింగ్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకటలక్ష్మి, బాబు, రాధ, శ్రీనివాసులు, అల్లిపీరా, ఎస్తేరమ్మ, సుబ్బరాయుడు మునిరాజు, లక్ష్మి, ప్రభావతి, భారతి, రవీంద్ర, ప్రసాద్‌రావు, మహేష్, ఆల్లీపీరా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డోన్ అగ్నిమాపక నివారణ శాఖ అధికారి ఎం.రంగస్వామి గౌడు అన్నారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొత్తబస్టాండు ప్రాంతంలో ప్రజలకు, ప్రయాణికులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చేసిన నీటి విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా చూశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రంగస్వామి, ప్రభాకర్, రాజు, రాజశేఖర్, రవీంద్రనాథ్, గౌరి శంకర్ పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించాలి



బావిలో పేరుకుపోయిన వ్యర్థాలు

సంజామల,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సంజామలలో కమలమ్మ బావిలో నిండుకపోయిన వ్యర్థాలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఒకప్పుడు గ్రామంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన బావి నేడు శిథిలావస్థకు చేరిందని స్థానికులు, చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను వేయడంతో పుడిపోయిందన్నారు. ఇన్నేళ్లుగా గ్రామస్థులకు తాగునీటిని అందించిన బావిలో పూడిక తీయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళల రక్షణకు చర్యలు

చాగలమర్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌తో మహిళల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో శక్తి టీం ఏఎస్ఐ ఆధ్యక్షతన శక్తి యాప్‌పై అవగాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ, విద్యార్థినులు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యా ల, అత్యాచారాల, దాడుల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం శక్తి యాప్ తెచ్చిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో శక్తి టీం సభ్యులు సుబ్బలక్ష్మి, బాలాల్, సుప్రజ, సావిత్రి, హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు సింగం భరత్‌రెడ్డి పై దాడి కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 15న కోవెలకుంట్ల రస్తాలో మున్సిపాలిటీ గేట్ల వసూలు విషయంలో టీడీపీ నాయకుడు సింగం భరత్‌రెడ్డిపై కర్రలతో దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన అంజి, దామోదర్, సురేష్, తేజ, భూపతి రాజు, దొమ్మరి శివా, నాగాంజిపై కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

కప్పలవాగు బ్రిడ్జికి మోక్షం

- రూ.1.50 కోట్లు మంజూరు
- హామీని నెరవేర్చిన మంత్రి జనార్దన్‌రెడ్డి
- తీరనున్న ఏడు గ్రామాల ప్రజల కష్టాలు
- నేడు పనులకు శ్రీకారం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కప్పలవాగు బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నికల వేళ ఓట్ల కోసం వచ్చిన ప్రస్తుత మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చి రోడ్లు భవనాల శాఖ మంత్రి కూడా అయ్యారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వల్లంపాడు గ్రామంలో రహదారిలో ఉన్న కప్పలవాగుకు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేయించి నూతన బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏళ్ల నుంచి ఉన్న సమస్య మంత్రి చొరవతో తీరనుంది. బ్రిడ్జి నిర్మాణానికి టెండరు పూర్తయ్యాయి. బుధవారం నుంచి పనులు ప్రా రంభం కానున్నాయి. వల్లంపాడు గ్రామ సర్పంచ్ గార్లపేటి జగదీశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కోవెలకుంట్ల నుంచి వెలగటూరు, బిజినవేముల, ఎం.గోవిం దిన్నె, పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల, గుండుపాపల మీదుగా నంద్యాలకు నిత్యం వాహనదారులు తిరుగు తుంటారు. అలాగే లింగాల నుంచి కూలూరు, పుసులూరు మీదుగా నంద్యాలకు ఇంకో వైపు వాహన దారులు నిత్యం తిరుగు తుంటా రు. అయితే ఈ గ్రామాల మధ్య ఉన్న వాగులు, వంకలు వర్షం వచ్చి నప్పుడు మాత్రమే ప్రవహిస్తాయి. వల్లంపాడు గ్రామం దగ్గరలో ఉన్న కప్పలవాగు మాత్రం కుందూనది నీరు పక్కకు వచ్చి కప్పల వాగు మీదుగా ప్రవహిస్తుం టాయి. దీంతో ఈ వాగులో నిత్యం మోకాలి లోతు నీరు ఉంటుంది. ఈ రహదారి వైపు వెళ్లే వాహనదారులకు వర్షాకాలం కష్టాలు తప్ప డం లేదు. వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగ దీశ్వర్‌రెడ్డి కప్పలవాగు సమస్యను మంత్రి బీసీ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని కప్పలవాగుకు రూ.1.50 కోట్లతో నూతన బ్రిడ్జిని మంజూరు చేయించారు.



బ్రిడ్జి నిర్మించనున్న కప్పలవాగు

బ్రిడ్జి నిర్మాణం ఇలా

బ్రిడ్జి నిర్మాణానికి రూ1.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 18 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మిస్తారు. బ్రిడ్జి కింద నుంచి నీరు వెళ్లేందుకు మూడు తూములు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్నదానికంటే మూడు మీటర్ల ఎత్తు బ్రిడ్జి ఉంటుంది. సీసీ రోడ్డుతో బ్రిడ్జికి ఇరువైపులా రహదారిలో కలిపివేస్తారు.

మంత్రి చొరవతోనే..



ఏపీరోడ్లుభవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి ప్రత్యేక చొరవతో వల్లంపాడు, కప్పల వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. దీంతో మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

- జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్, వల్లంపాడు

విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ నాయకులు, వీవోఏల డిమాండ్
- మండల సమాఖ్య కార్యాలయానికి తాళం

బేతంచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాతబస్టాండు నుంచి వెలుగు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వెలుగు కార్యాలయంలోకి ప్రవేశించి నినాదాలు చేశారు. వెలుగు సిబ్బంది కార్యాలయం అధికారులను బయటకు పంపించి కార్యాలయానికి తాళం వేశారు. వీవోఏ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య, సీఐటీయూ మండల నాయకులు వైబీ వెంకటేశ్వర్లు, మధుశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న వీవోఏలను గ్రామైక్య సంఘాల్లో ఎలాంటి తీర్మానాలు లేకుండా తొలగించడం దారుణమన్నారు. వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీఎం నిబంధనలకు విరుద్ధంగా వీవోఏలను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే గత ప్రభుత్వ హయాంలో ఉన్న నిర్బంధాలు ఉండవని, సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మి ఓటు వేస్తే చిరుద్యోగులపై ప్రతాపం చూపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎస్.వెంకటరమణ, వీవోఏలు, గ్రామైక్య సంఘాల నాయకులు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న వీఏవోలు, నాయకులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డోన్ ఆవాజ్ కమిటి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు జలదుర్గం రసూల్, ఎస్ఏ చిన్నరెహిమాన్, డి.అక్బర్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆవాజ్ కార్యాలయంలో బీరువాల సలాం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ 5న అర్ధరాత్రి వక్ఫ్ సవరణ చట్టం తీసుకవచ్చి దానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కొన్ని రాజకీయ పార్టీలు, ముస్లీం పర్సనల్ లా బోర్డు, ప్రజా సంఘాలు, సుప్రీం కోర్టును ఆశ్రయించారన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగి దేశమని, ముస్లీం మైనార్టీలపై భౌతికదాడులు చేస్తుంటే వాటిని ఖండించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం సరికాదన్నారు. వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టుకు ప్రధాని మోదీ ప్రభుత్వం సిద్ధమైందని, ముస్లింపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఆవాజ్ నాయకులు ఆరోపించారు. సమావేశంలో హుశేన్‌బాషా, నూర్‌బాషా, మహబూబ్, ఆయేషా, ఖాజా, రఫీ, హుశేన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ నాయకులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ముస్లిం అడ్వకేట్ ఫోరం నాయకులు

ముస్లింల ర్యాలీ

బనగానపల్లె : వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం అడ్వకేట్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం న్యాయవాదులు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును తీసుక రావటంతో ముస్లింల సంక్షేమానికి, ఇస్లాం ధర్మానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాటం సాగిస్తామన్నారు.

అందని పెట్టుబడి సాయం

- ప్రతి ఏటా తగ్గుతున్న పీఏం కిసాన్ యోజన అర్హుల సంఖ్య
- సాయానికి దూరంగా 1.19 లక్షల మంది రైతులు
- ఆరేళ్లుగా కొత్త వారికి జాబితాలో దక్కని చోటు
- అవకాశం కల్పించాలంటున్న రైతులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కర్షకుల కష్టాలకు కాస్తయినా ఆసరాగా నిలవాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం కొత్తగా భూములు కొనుగోళ్లు చేసిన అన్నదాతలకు అందని ద్రాక్షలా మారింది. గత ఆరేళ్లుగా రైతులు కొత్త దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కొత్త వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడం, ఉన్న రైతులు అర్హత కోల్పోతుండటంతో లబ్ధిదారుల సంఖ్య ప్రతి ఏటా పెద్ద ఎత్తున తగ్గిపోతోంది. సాగుదారులకు పెట్టుబడి సాయంగా ప్రతి ఏటా రైతన్నలకు పీఏం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం రూ.ఆరువేలు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఏడాదిలో మూడు విడతలు రూ.2000 చొప్పున అన్నదాతల ఖాతాల్లో ఈ మొత్తాన్ని నేరుగా జమ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని అమలులోకి తీసుకవచ్చింది. అయితే 2019 ఫిబ్రవరి-1కి ముందు పట్టాదార్ పాసు పుస్తకం కలిగి, ఆన్ లైన్ .. వెబ్ ల్యాండ్ .. అడంగల్‌లో పేర్లు ఉన్న రైతులకు మాత్రమే ఈపథకం వర్తింపజేశారు. ఆ తర్వాత భూములు కొనుగోళ్లు చేసిన కొత్త రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఏడాది	కర్నూలు లబ్ధిదారులు	నంద్యాల లబ్ధిదారులు
2022-23	2,57,796	2,21,241
2023-24	2,44,386	2,10,509
2024-25	2,42,934	1,98,000

ప్రతి ఏటా తగ్గుతున్న సంఖ్య

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అందించే పీఏం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి ప్రతి ఏటా రైతుల సంఖ్య తగ్గు తూ వస్తోంది. పథకం ప్రారంభ సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.60లక్షల మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకు న్నారు. అనంతరం ఈకేవైసీ పూర్తి చేసుకోకపోవడం, రేషన్ కార్డులు కోల్పోవడం, ఇన్‌కం ట్యాక్స్ పరిధి లోకి రావడం, కొందరు లబ్ధిదారు లు మృతి చెందడం తదితర అనేక కారణాలతో ఈ ఆరేళ్లలో 1.19లక్షల మంది రైతులు పథకా న్ని కోల్పోయారు. తాజాగా ఇటీవల ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం అందించిన 19వ విడత పెట్టుబడి సాయానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4.40లక్షల మంది రైతులకు రూ.88.01కోట్లు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

కుటుంబంలో ఒక్కరికే అవకాశం

మరోవైపు ఒకే కుటుంబంలో ఎంత మంది రైతులున్నా ఒక్కరికే పెట్టుబడి సాయం అందుతోంది. దీంతో భూములు కలిగి ఉన్నప్పటికీ రైతులు పెట్టుబడి సాయాన్ని అందుకోలేక పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 1లక్ష మందికి పైగా కొత్తగా పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్న రైతులు ఉన్నట్లు ప్రాథమిక అంచన. కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవడానికి కేంద్రం అవకాశం కల్పిస్తే ఖచ్చితమైన రైతుల సంఖ్య తెలిసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు (ఫైల్)

ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి



ఐదు సంవత్సరాలుగా పీఏం కిసాన్ పథకం రావడం లేదు. పెట్టుబడి కోసం అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అవకాశం కల్పించాలి.

- పిక్కిలి శ్రీనివాసులు, రైతు, మీర్జాపురం

యువత క్షణికావేశానికి గురి కావద్దు: సీఐ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యువత క్షణికావేశానికిలోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల యువతీ, యువకులు చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగించే విషయమన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, ఉద్యోగం రాలేదని, తల్లిదండ్రులు మందలించారని, ప్రేమలో విఫలమయ్యామని తదితర కారణాలతో విలువైన ప్రాణాలను త్యజించడం తగదన్నారు. ప్రతి ఓటమిని ఒక గుణపాఠంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి దాతలు విరాళం ఇచ్చారు. గ్రామానికి చెందిన పెద్ద బాలసుబ్బరాయుడు, పుల్లమ్మ కుటుంబ సభ్యులు ఆలయాభివృద్ధికి రూ. రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి అందజేశారు. అలాగే అన్నమయ్య జిల్లా కోరముట్ల జయరాం, గంగాదేవి వారి కుటుంబ సభ్యులు రూ.1.50లక్షల విరాళాన్ని అందజేశారు.

అమ్మవారికి బోనాలు



అమ్మవారికి హారతి ఇస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగాన పల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యనకం డ్లలో మంగళవా రం పొలిమేర పెద్దమ్మ బోనా ల ఉత్సవాలు మంగళవా రం ఘనంగా నిర్వహిం చారు. ఉత్సవా ల్లో టీ డీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొని పెద్ద మ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

రుద్రవరం : రుద్రవరంలో మంగళవారం పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఆర్.కొత్తపల్లిలో పూజలు

డోన్ రూరల్: బేతంచెర్ల మండలం ఆర్.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం సుంకులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన శేషారెడ్డి ఆహ్వానం మేరకు ఈ పూజా కార్యక్రమానికి టీడీపీ డోన్ నియోజకవర్గ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజల్లో చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

బనగానపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. మంగళవారం మండలంలోని టంగుటూరులో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, హరినాథ్‌గౌడ్, యాగంటీశ్వరుడు, ఓబయ్య, రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బూట్లు, బ్యాగులు రెండుజతల దుస్తులు, నోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించినట్లు వివరించారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలకు ఎస్సీ కులాల వారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 10 యూనిట్లకు రూ. 15.76 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. యూనిట్‌ను బట్టి సబ్సిడీ వర్తిస్తుందని ఆయన తెలిపారు. అర్హులైన వారు మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల నివారణపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తరచూ సంభవించే వరదలు, అకాల వర్షాల వల్ల దెబ్బతింటున్న పంటలు, ధాన్యం దెబ్బతినటం నష్టం జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణ నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణంలోని దుర్గాపేటకు చెందిన నాగార్జున (41) అనే వ్యక్తి చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... దుర్గాపేటకు చెందిన కర్నూలు నాగార్జున మద్యానికి బానిసై పనిపాటా లేకుండా తిరుగుతుండటంతో భార్య నిలదీసింది. దాంతో మనస్తాపానికి గురైయాడు. భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం వల్ల భార్య లక్ష్మీదేవి తన పుట్టింటికి వెళ్లి వచ్చింది. ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మట్కా బీటర్ అరెస్ట్

కోవెలకుంట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఓ మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో కొందరు వ్యక్తులు మట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి బనగానపల్లె సర్కిల్ వద్ద దాడి చేశామన్నారు. మట్కా రాస్తున్న మంగలి పుల్లయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.1400 నగదు, చీటీలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ సూచించారు. మంగళవారం మాదకద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వీ.కెన్నెడి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో ఫా ర్మాసిస్టు మునిస్వామి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు డాక్ట ర్ హెచ్.రామసుబ్బారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, క్రిష్ణదాసు, నరేంద్రనాథరెడ్డి, కేవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

అవుకు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారన్నారు. అధికారు లు, ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పైపులు దగ్ధం

బేతంచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన ఉన్నం చంద్రశేఖర్ అనే రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న పైపులు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమయ్యాయి. దీంతో రూ.30వేలు నష్టం వాటిల్లింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. పైపులు కొనుగోలు చేసి పొలంలో ఉంచాను. విద్యుత్ స్తంభానికి చిన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న పైపులు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యాయి.